సాక్షి వరంగల్

మహిళా దినోత్సవం

శనివారం । 8 । మార్చి । 2025






వివక్ష తగ్గినా వేధింపులున్నాయి..

'సాక్షి' సర్వేలో మహిళల మనోగతం

మహిళలపై బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు కొనసాగుతున్నాయి. పనులు చేస్తున్న మహిళలకు కార్యాలయాల్లో వేధింపులు కొంతమేర కొనసాగుతున్నా.. సెల్‌ఫోన్లలో కొందరు అసభ్యపదజాలంతో పంపిస్తున్న మెసేజ్‌లతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం ఇంట్లో చెప్పలేక సతమతమవుతున్నారు. మానసికంగా ఇబ్బంది పెడుతున్న వారిలో తెలిసిన వారితోపాటు తెలియని వారు ఉన్నట్లు పలువురు మహిళలు చెబుతున్నారు. నాడు వంటింటికే పరిమితమైన మహిళ.. నేడు విద్య, ఉద్యోగం, నచ్చిన రంగంలో ఎదుగుతూ పురుషులతో సమానంగా పనిచేస్తోంది. మహిళా దినోత్సవం నేపథ్యంలో ఆడ–మగ వివక్ష, పని ప్రదేశంలో వేధింపులు తదితర అంశాలపై ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 'సాక్షి' సర్వే నిర్వహించగా పలు విషయాలు వెలుగుచూశాయి. - సాక్షి నెట్‌వర్క్


శాంపిల్స్: 310 (గ్రేటర్‌వరంగల్ 60మంది, మిగతా ఐదు జిల్లాలు (వరంగల్, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, ములుగు 50మంది చొప్పున) అన్ని వర్గాల మహిళలను పరిగణనలోకి తీసుకుని వారి అభిప్రాయాల సేకరణ.




1) మీ ఇంట్లో ఆడ - మగ వివక్ష ఏమైనా ఉందా..?
ఎ) ఉంది బి) లేదు సి) చెప్పలేను



2) మీ కాలేజీ - పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్ష ఎదుర్కొంటున్నారా..?
ఎ) లేదు బి) ఉంది సి) చెప్పలేను



3) మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్న ప్రదేశం?
(ఎ) సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లతో..
బి) బస్టాప్‌లో సి) కాలేజీ లేదా ఆఫీస్‌లో



4) మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు?
ఎ) తెలియని వారు
బి) తెలిసిన వారే

న్యూస్‌రీల్

10 నుంచి ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే నిర్వహించాలి



కాశోజీ సెంటర్: ఎంపిక చేసిన 50 పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించడానికి ఈనెల 10, 11, 12 తేదీల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్ తేజ సూచించారు. సర్వే నిర్వహించేందుకు డైట్ విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎంపిక చేసి రెండు రోజుల శిక్షణను కరీమాబాద్ పాఠశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి టాంజరీన్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. మొదటి రోజు తెలుగు, రెండో రోజు గణితం, మూడో రోజు ఆంగ్లంలో పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. రిసోర్స్‌పర్సన్స్ బి.కుమారస్వామి, ఎం రఘుపతి, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

శోభారాణికి పురస్కారం



నర్సంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నర్సంపేట లీడ్ గ్రంథాలయ నిర్వాహకురాలు కాసుల శోభారాణి శుక్రవారం ధాత్రిరత్న సేవా పురస్కారాన్ని అందుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నందుకు ఆమెకు రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, జిల్లా వైస్ చైర్‌పర్సన్ విజయకుమారి ఆమెను అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 245 మంది గైర్హాజరు

కాశోజీ సెంటర్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 26 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. 5,152 మంది జనరల్ విద్యార్థులకు 4,979 మంది, 885 మంది ఒకేషనల్ విద్యార్థులకు 813 మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. మొత్తం 245 మంది గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

సరిపడా ఎరువులు, పురుగు మందులు

- ఎఫ్‌సీఓ మార్గదర్శకాల మేరకు నిల్వచేయాలి
- జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ
- గొర్రెకుంటలో గోదాంల తనిఖీ



గీసుకొండ: ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) మార్గదర్శకాల ప్రకారం ఎరువులు, పురుగు మందులను నిల్వచేయాలని, లేదంటే వారికి నోటీసులు ఇచ్చి లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట పరిధిలోని ఎరువులు, పురుగుల మందుల గోదాములను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టాక్ రిజిస్టర్, ఇన్‌వాయిస్‌లు, కోరమండల్ నిల్వగోదాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్‌కు సరిపడా ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు అందుబాటులో ఉన్నాయని, మోతాదును మించి పంటలకు వేయవద్దని, వ్యవసాయ అధికారులు సూచనలను పాటించాలని కోరారు. గోదాంలలో గడువు ముగిసిన పురుగుల మందులను వేరుగా భద్రపరిచి లేబ్లింగ్ చేయాలని పేర్కొన్నారు. కంపెనీలు సంబంధిత పురుగుల మందుల ప్యాకింగ్‌పై తయారీదారు, అమ్మకందారు, ఉత్పత్తికి సంబంధించిన వివరాలను స్పష్టంగా ముద్రించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఆమె వెంట మార్క్‌ఫెడ్ డీఎం వై.రజినీకాంత్‌రెడ్డి, ఏఓ హరిప్రసాద్‌బాబు, గోదాంల ఇన్‌చార్జ్ అశ్వక్‌అహ్మద్ ఉన్నారు.

సంకల్ప శక్తులు

వారి సంకల్పం గొప్పది. ఆశయం ఉన్నతమైనది. హేళనలు, అవమానాలేమీ వారు చేసే పనులకు అడ్డంకి కాలేదు. ప్రతికూల పరిస్థితులెదురైనా, పురుషాధిక్య రంగమైనా వారు పట్టు వీడలేదు. అన్ని రంగాల్లోనూ మాదే పై చేయి అంటూ ముందుకు సాగుతున్నారు. చిన్నతనంలో వివాహమై భర్తను కోల్పోయిన ఒకరు కుటుంబానికి అండగా నిలబడితే.. మరొకరు పేదరికాన్ని పారదోలేందుకు నడుంకట్టారు. ఇంకొకరు విశ్వవేదికపైన జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేశారు. నేడు(శనివారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సంకల్ప శక్తులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కుటుంబాన్ని నడిపిస్తున్న మహిళామణులు

- విభిన్న రంగాల్లో రాణిస్తూ ఆదర్శం
- పురుషులకు దీటుగా బాధ్యతలు

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హోటల్ నడుపుతూ.. పిల్లలను చదివిస్తూ..



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన భీమారపు ఓదెలు హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. కట్టెల పొయ్యి కారణంగా అతడి చూపు దెబ్బతిన్నది. భార్య ప్రమీల 20 ఏళ్లుగా హోటల్ నడుపుతూ పిల్లలను చదివిస్తోంది. గతేడాది పెద్దమ్మాయికి పెళ్లి చేసింది. మిగతా ఇద్దరు పీజీ, ఎంటెక్ చదువుతున్నారు. ఓదెలు కూరగాయలు కట్ చేసివ్వడం, పిండి కలపడం వంటి పనుల్లో ఆమెకు సాయం చేస్తుంటాడు. తమ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని వారు కోరుతున్నారు.

సంకల్పం ముందు చిన్నబోయిన వైకల్యం

సంగెం: వైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని నిరూపించింది సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దామెరుప్పుల రమాదేవి. ఆమెకు ఆర్నెళ్ల వయసులోనే జ్వరం వచ్చింది. కాళ్లు చచ్చుబడిపోయాయి. వైకల్యాన్ని జయించాలంటే చదువు ఒక్కటే మార్గమని.. నమ్మింది. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. గత ఏడాది డిసెంబర్ 5, 6 తేదీల్లో కాంబోడియా దేశంలో ఇంటర్నేషనల్ త్రోబాల్ పోటీలకు మన దేశం తరఫున పాల్గొని మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది.



గోల్డ్‌మెడల్ సాధించిన రమాదేవి (ఫైల్)

చీకట్లో 'వెన్నెల'



ఇద్దరు పిల్లలతో వెన్నెల

సాక్షి, మహబూబాబాద్: దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన గొడిశాల మల్లయ్య సుగుణమ్మల కుమార్తె వెన్నెల. పుట్టిన ఎనిమిదేళ్లకే తండ్రి మరణించాడు. ఆతర్వాత వెన్నెలను నర్సింహులపేట మండల కేంద్రంలోని అక్కా, బావ తీగల వెంకన్న, సుజాత చేరదీసి చదివించారు. పదోతరగతి చదివిన వెన్నెలకు మహబూబాబాద్ మండలం పర్వతగిరికి చెందిన నారమళ్ల సంపత్‌తో వివాహం జరిపించారు. చిన్నతనంలోనే ఇద్దరు ఆడపిల్లలకు తల్లయ్యింది. మిర్చి పంటకు తామర పురుగు సోకడంతో కుటుంబం అప్పుల పాలయ్యింది. అప్పుల బాధతో భర్త సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో 19 ఏళ్లకే వెన్నెల వితంతువుగా మారింది. ఆరేళ్ల సాన్విక, మూడేళ్ల తన్వికతో పాటు తల్లి సుగుణమ్మ, అత్త, మామ పోషణ ఆమెపై పడింది. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తోంది.

మూగజీవాల నేస్తం.. డాక్టర్ అనిత



పాడి గేదెకు కృత్రిమ గర్భధారణ చేస్తున్న డాక్టర్ అనిత

లింగాలఘణపురం: మండల కేంద్రంలో పశువైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆడెపు అనిత పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారుల మన్ననలు పొందుతున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన అనిత 2019లో లింగాలఘణపురం పశువైద్యాధికారిగా విధుల్లో చేరారు. పశువైద్యశాలకు వచ్చే మూగ జీవాలకు వైద్యం చేస్తూనే.. వ్యవసాయబావులు దూరంగా ఉండి ఆస్పత్రికి రాలేని పశువుల వద్దకు స్వయంగా ద్విచక్రవాహనంపై వెళ్లి వైద్యం చేస్తున్నారు. పశువులకు కృత్రిమ గర్భధారణలో ప్రత్యేకత చాటుకున్నారు. 63 శాతం సక్సెస్ సాధించారు. పశువులు, గొర్రెలకు వ్యాక్సినేషన్‌ను నూటికి నూరు శాతం అమలు చేస్తూ రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు నేస్తంగా మారిపోయారు.

కట్టె కోత.. బాధ్యతల మోత



కట్టెకోత మిల్లులో మగవారితో సమానంగా పని చేస్తోంది వరంగల్ నగరం నాగేంద్రనగర్‌కు చెందిన ఎండీ రజియా. భర్త అనారోగ్యం కారణంగా కుటుంబ భారం ఆమెపై పడింది. 15 ఏళ్లుగా నగరంలోని జగన్నాథం సామిల్లులో కట్టర్‌గా పనిచేస్తోంది. ముగ్గురు పిల్లల పెళ్లి చేయగా.. కూతురు కుటుంబంలో కలహాలు రావడంతో ఆమె తల్లివద్దే ఉంటోంది. వీరందరికీ రజియా పని చేస్తేనే భోజనం. సొంతిల్లు ఉంటే కొంత భారం తగ్గుతుందని రజియా అంటోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

చేయి చేయి కలిపి.. పేదరికాన్ని తరిమి



సబ్బులు తయారు చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండలంలోని శివాపురంలో ట్రైకార్ సాయంతో ఐటీడీఏ ద్వారా పది మంది మహిళలు సమ్మక్క–సారలమ్మ డిటర్జెంట్ సబ్బుల తయారీ పరిశ్రమను నెలకొల్పారు. ట్రైకార్ నుంచి 60 శాతం సబ్సిడీ, బ్యాంకు నుంచి 30 శాతం రుణం తీసుకుని పరిశ్రమ నడుపుతున్నారు. తయారు చేసిన సబ్బులకు ఒక్కోదానికి రూ.10గా ధర నిర్ణయించి గిరిజన సహకార సంఘానికి(జీసీసీ) విక్రయిస్తున్నారు. రోజుకు సుమారు 4 వేల సబ్బులు తయారు చేస్తున్నారు. ఐదేళ్లుగా కోటిన్నర రూపాయల వ్యాపారం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సబ్బుల తయారీలో ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళా దినోత్సవ సర్వే, కథనాలను సాక్షి గెస్ట్ ఎడిటర్ మనీషా శ్రవణ్ ఉన్నవ్‌కు వివరిస్తున్న ఎడిషన్, బ్యూరో ఇన్‌చార్జులు వర్ధెల్లి లింగయ్య, గడ్డం రాజిరెడ్డి



సాక్షి గెస్ట్ ఎడిటర్

సమాచార వారధిగా పత్రికల సేవలు భేష్

'సాక్షి' గెస్ట్ ఎడిటర్, వరంగల్ జిల్లా రెండో అదనపు జడ్జి (పోక్సో కోర్టు) మనీషా శ్రవణ్ ఉన్నవ్

- వార్తకు అనుగుణంగా శీర్షికలు ఉండాలి..
- కచ్చితమైన సమాచారం ఉండేలా చూసుకోవాలి..
- మహిళా దినోత్సవ కథనాలు బాగున్నాయని కితాబు



మహిళా దినోత్సవ కాపీలను చదువుతున్న సాక్షి గెస్ట్ ఎడిటర్ మనీషా శ్రవణ్ ఉన్నవ్



పేజీ లేఔట్‌ను పరిశీలిస్తూ..

వరంగల్ లీగల్ : ప్రజలకు, అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సమాచార వారధిగా వార్తా పత్రికలు నిలవాలని సాక్షి గెస్ట్ ఎడిటర్, వరంగల్ జిల్లా రెండో అదనపు జడ్జి (పోక్సో కోర్టు) మనీషా శ్రవణ్ ఉన్నవ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయానికి శుక్రవారం ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వచ్చారు. ముందుగా జడ్జికి సాక్షి ఎడిషన్, బ్యూరో ఇన్‌చార్జులు వర్ధెల్లి లింగయ్య, గడ్డం రాజిరెడ్డి, లీగల్ రిపోర్టర్ జీవన్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. మొదట ఎడిటోరియల్ విభాగానికి చేరుకున్నారు. ఫీల్డ్ నుంచి రిపోర్టర్లు పంపిన కాపీలు డెస్క్‌కు ఎలా చేరుతాయో పరిశీలించారు. ఎడిటోరియల్ విభాగాన్ని పరిశీలించి సబ్ ఎడిటర్లు వార్తలు దిద్దుతున్న తీరును గమనించారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన కాపీలను చూసి కావాల్సిన అదనపు అంశాలు, సమాచారాన్ని తెప్పించుకోవాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే రిపోర్ట్‌ను పరిశీలించి పేజీ లేఔట్‌పై తగిన సూచనలిచ్చారు. సర్వే అంశాలు బాగున్నాయని, వాటిని ఎలా నిర్వహించారో అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విజయవంతంగా ముందుకు సాగుతున్న మహిళలపై తెప్పించిన కథనాలను చూసి తగిన ఫొటోలు ఉన్నాయా.. లేవా? అని సరిచూసుకోవాలని, అక్షరదోషాలు లేకుండా దిద్దాలని సూచించారు. అనంతరం ఐటీ, ఏడీపీటీ, స్కానింగ్, సీటీపీ, ప్రొడక్షన్ విభాగాలను పరిశీలించారు. వాటి పనితీరును తెలుసుకున్నారు. నూతన టెక్నాలజీతో అన్ని రంగుల్లో పత్రిక వెలువడుతున్న తీరును చూసి బాగుందని కితాబిచ్చారు.

ప్రజలకు ఉపయోగపడే వార్తలివ్వాలి..

పత్రికలో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే వార్తలు ఇవ్వాలని మనీషా శ్రవణ్ ఉన్నవ్ అన్నారు. న్యాయసంబంధ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రచురించాలని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలను జర్నలిజంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ఆధారాలతో పరిశోధనాత్మక వార్తలు రాయాలని సూచించారు. మహిళా చైతన్యంలో పత్రికలు కీలకమని పేర్కొన్నారు. సాక్షి గెస్ట్ ఎడిటర్‌గా తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సాక్షి సిబ్బంది ఆమెకు శాలువా అందించి సన్మానించారు.

మహిళల 'సౌర' సాగు..
ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- 8లో ▶

ఆమెకు అండగా..
పోకిరీల ఆట కట్టిస్తున్న 'షీ'టీమ్

కూతుళ్లే మహారాణులు
కొందరు ఒక్కరితో సరి..

అన్ని రంగాల్లో మహిళలకు గుర్తింపు

- కలెక్టర్ సత్యశారద



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని కలెక్టర్ సత్యశారద అన్నారు. టీఎన్జీఓ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో కలెక్టర్ మాట్లాడారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల పెంపకంలో కుమార్తెలు సెన్సిటివ్‌గా మారుతున్నారని పేర్కొన్నారు. మహిళలు అనగానే సానుభూతి, త్యాగాలకు ప్రతీక ఒకప్పటి మాట అని, ప్రస్తుతం కొన్ని సమయాల్లో కఠినత్వాన్ని ప్రదర్శించక తప్పదని కలెక్టర్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.

జ్యూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరం

జ్యూట్ ఉత్పత్తులపై అవగాహన అవసరమని కలెక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జనపనార ఉత్పత్తులు ప్రజల దినచర్యలో భాగం కావాలని పేర్కొన్నారు. జనపనార ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలతో కూడిన జూట్ మార్క్ ఇండియా పథకంపై భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ, టెక్స్‌టైల్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ జె.నిశాంత్ మేత్రాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మహిళలకు వివరించారు. సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పొదుపు సంఘాల మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్

- రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఝా బదిలీ
- సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న సన్‌ప్రీత్
- డీసీపీ రవీందర్ కూడా ట్రాన్స్‌ఫర్.. ఆయన స్థానంలో ఐపీఎస్ అంకిత్
- క్రైం డీసీపీగా బెదరకోట జనార్దన్

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ నియమితులయ్యారు. ప్రస్తుత సీపీ అంబర్ కిషోర్ ఝా పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

17 నెలలకే అంబర్ కిషోర్ ఝా బదిలీ



2023 అక్టోబర్ 13న అంబర్ కిషోర్ ఝా వరంగల్ సీపీగా నియమితులయ్యారు. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంబర్ కిషోర్ ఝా ఇక్కడ 17నెలలు పనిచేశారు. 2023 అసెంబ్లీతోపాటు పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. 17 నెలల్లోనే ఆయనకు బదిలీ కాగా.. అంతే ప్రాధాన్యత గల మరో కమిషనరేట్ సీపీగా నియమితులయ్యారు.

సూర్యాపేట ఎస్పీ నుంచి వరంగల్ కమిషనర్‌గా సన్‌ప్రీత్..



వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్‌సింగ్ ప్రస్తుతం సూర్యాపేట జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన 2012లో ములుగు ఏఎస్పీగా, వరంగల్ రూరల్ ఓఎస్డీగా పనిచేశారు. అనంతరం ఎల్బీ నగర్ డీసీపీగా, జగిత్యాల ఎస్పీగా కూడా విధులు నిర్వర్తించారు.

ఈస్ట్ జోన్ డీసీపీగా అంకిత్ కుమార్..



వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీగా ఉన్న రవీందర్‌ను సీఐడీకి బదిలీ చేసిన ప్రభుత్వం... ఆయన స్థానంలో డీసీపీగా అంకిత్ కుమార్‌ను నియమించింది. 2020 బ్యాచ్‌కు చెందిన అంకిత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ట్రైనీ ఐపీఎస్‌గా పనిచేశారు.

క్రైం డీసీపీగా జనార్దన్



వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా బెదరకోట జనార్దన్ నియమితులయ్యారు. ప్రస్తుతం టీజీ ఎన్పీడీసీఎల్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ఉన్న ఆయన 1989 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన వారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో వివిధ పోస్టుల్లో పోలీసు అధికారిగా పనిచేశారు. సుమారు మూడేళ్లుగా ఎన్పీడీసీఎల్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసం..


నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ


- వ్యక్తి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: ప్రభుత్వ ఉద్యోగాలు, నిట్ లాంటి కళాశాలలో సీటు ఇప్పిస్తానంటూ బాధితుల నుంచి రూ. లక్షల్లో డబ్బుతో పాటు బంగారు ఆభరణాలు దండుకున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.5.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2.68 లక్షల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఐడీఎఫ్‌సీ డెబిట్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా, వీరపునాయుడిపల్లి మండలం, ఇందుకూరు కొత్తపల్లికి చెందిన కొమ్మ వివేకానంద రెడ్డి అలియాస్ కిశోర్ రెడ్డి కొంత కాలం ప్రైవేట్ టీచర్‌గా పనిచేశాడు. ఈ సమయంలో సహ ఉద్యోగుల వద్ద అవసరానికి డబ్బులు, బంగారం తీసుకుని ఇవ్వకుండా మోసం చేశాడు. ఈ ఘటనలో రెండు నెలలు జైలు జీవితం గడిపాడు. అనంతరం తన మకాం హనుమకొండకు మార్చాడు. ఇక్కడ మరోపేరుతో ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూనే తనకు వరంగల్ నిట్‌లో పరిచయస్తులు ఉన్నారని, ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళా టీచర్‌ను నమ్మించి ఆమెవద్ద రూ.8 లక్షలతో పాటు ఆమె కొడుకుకు నిట్‌లో సీటు ఇప్పిస్తానని 60గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. అలాగే, మరో ముగ్గురు బాధితుల నుంచి ఇదే తరహాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తాను ఉంటున్న కిరాయి ఇంటి నుంచి సామగ్రి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

ఆమెకు అండగా..

మహిళలకు భద్రత, భరోసా కల్పిస్తున్న పోలీసులు



- పోకిరీల ఆట కట్టిస్తున్న 'షీ' టీమ్‌లు
- బాధిత మహిళలకు 'భరోసా' కేంద్రం..
- అతివలకు మహిళా పోలీసు స్టేషన్లు కొండంత అండ

వరంగల్ క్రైం: కుటుంబాల్లో చోటు చేసుకుంటున్న అలజడులు.. పనిచోట వేధింపులు.. కళాశాలలు, పాఠశాలల దగ్గర పోకిరీల ర్యాగింగ్.. ఇలా ఏ ఘటన జరిగినా బాధిత మహిళలు, బాలికలకు పోలీసులు భద్రత, భరోసా కల్పిస్తున్నారు. ఆపద సమయంలో మేం అండగా ఉన్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. మహిళ, బాలికల రక్షణకు పోలీస్ స్టేషన్లతో పాటు ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్లు, 'షీ'టీమ్స్ విభాగం, భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణకు అండగా నిలుస్తున్న పలు విభాగాల సేవలు అతివలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా మహిళలు, బాలికల రక్షణకు పోలీసులు, 'షీ' టీమ్స్ తీసుకుంటున్న చర్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

మఫ్టీలో 'షీ' టీమ్స్..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న 'షీ' టీమ్స్ విభాగం అధికారులు పోకిరీలపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిర్దేశించిన హాట్‌స్పాట్‌ల వద్ద 'షీ' టీమ్స్ పోలీసులు మఫ్టీలో ఉండి ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, షాపింగ్ మాల్స్, కళాశాలలు, పాఠశాలల వద్ద మఫ్టీలో ఉంటూ ఎవరైనా ఆకాయిలు.. మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే వారిని పట్టుకుంటున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి శృతి మించితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు.

బాధితులకు సాయం..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎక్కడైనా బాలికలు, మహిళలు లైంగికదాడికి గురైతే వారిని వెంటనే భరోసా కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ కేంద్రంలో ఏఎన్ఎం సేవలతో పాటు లీగల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిగే వరకూ భరోసా కేంద్రం అధికారులు అండగా నిలుస్తున్నారు. బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ వాతావరణం కనిపించకుండా, బాధితులు భయపడకుండా చర్యలు తీసుకుంటున్నారు. బాధితులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నారు.

మహిళలపై ఆగని దాడులు..

పోలీసులు మహిళా రక్షణ కోసం ఎన్ని చర్యలు తీసుకుంటున్న వారిపై దాడులు మాత్రం అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయి. గతేడాది వరకట్న మరణాలు 10 జరగగా 39 మంది వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ సంవత్సరం 8 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడిన నేపథ్యంలో గత సంవత్సరం 626, ఈ ఏడాది 91 కేసులు నమోదయ్యాయి. గతేడాది లైంగికదాడి కేసులు 146 కాగా , ఈ ఏడాది ఇప్పటి వరకు 22 జరిగాయి.

మహిళా పీఎస్‌లో కేసు తీవ్రతను బట్టి కౌన్సెలింగ్..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హనుమకొండ జిల్లాకు ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్ (అర్బన్) రంగంపేటలో ఉండగా, వరంగల్, జనగామ జిల్లాలకు ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్ సుబేదారిలో ఉంది. దంపతులు, కుటుంబాల కలహాలు, వివాహేతర సంబంధాలు, వరకట్న కేసులు, దాడులు.. ఇలా అనేక అంశాలలో ఫిర్యాదులు స్వీకరించి వాటి తీవ్రతను బట్టి మొదటి కౌన్సెలింగ్ నిర్వహించి ఆ తరువాత కేసులు నమోదు చేస్తున్నారు. బాధిత మహిళలకు కావాల్సిన అనేక రకాల విషయాలపై కౌన్సెలింగ్ నిర్వహించి అండగా నిలుస్తున్నారు.

ఫోన్ చేస్తే చాలు.. పట్టేస్తాం



మహిళలు, బాలికలు తమను పోకిరీలు ఇబ్బందులకు గురిచేసినా, ఫోన్లకు అసభ్యకర ఫొటోలు పంపినా, బ్లాక్ మెయిల్ చేసి బెదిరింపులకు పాల్పడినా ఫోన్ చేస్తే చాలు.. పోకిరీలను పట్టుకుని వారి ఆట కట్టిస్తాం. మహిళలు, బాలికలు ఎట్టి పరిస్థితుల్లో ధైర్యం కోల్పోవద్దు. కుటుంబీకులతో చెప్పుకోలేని విషయలను కూడా మా దగ్గర చెప్పుకోవచ్చు. అన్ని రకాలుగా అండగా ఉండి రక్షిస్తాం. ఇబ్బందులు తలెత్తుతే నేరుగా 8712 685142 నంబర్‌కు ఫోన్ చేయండి.

-కొడురి సుజాత, ఇన్‌స్పెక్టర్ 'షీ' టీమ్స్

బాధిత మహిళలకు భరోసా 'సఖి' కేంద్రాలు..

సాక్షి, వరంగల్/ సాక్షి, మహబూబాబాద్ : సఖి కేంద్రాలు బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్నాయి. వేధింపులు, గృహ హింస నుంచి మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడానికి ఈ కేంద్రాలు సాయపడుతున్నాయి. బాధిత మహిళకు తక్షణ వైద్యం, న్యాయ, ఆర్థిక సాయం అందిస్తున్నాయి. కాగా, 181 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించడం ద్వారా బాధిత మహిళలకు సాయం అందనుంది. కాగా, వరంగల్ సఖి సెంటర్ 2019 డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 1295 కేసులు వస్తే 945 పరిష్కరించారు. 200 కేసులు మూసివేశారు. 21కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 109 కేసులు కోర్టులో నమోదయ్యాయి. అలాగే, మహిళా హెల్ప్ లైన్ ద్వారా 725 కేసులు నమోదయ్యాయి.


మహిళను రక్షించి సఖి కేంద్రానికి తీసుకొచ్చిన సిబ్బంది

వరంగల్ సఖి సెంటర్ ద్వారా అందించిన సేవల వివరాలు

కౌన్సెలింగ్ నిర్వహించిన కేసులు :	1292
ఫ్రీ లీగల్ ఎయిడ్/ లీగల్ కౌన్సెలింగ్ అందించిన కేసులు:	527
పోలీసు సాయం అందించిన కేసులు :	426
వైద్య సాయం అందించిన కేసులు:	566
వసతి కల్పించిన కేసులు :	402
అత్యవసర సమయాల్లో రెస్క్యూ చేసిన కేసులు :	75
సర్వైవర్ కిట్స్ ఇచ్చిన కేసులు :	60
ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు:	856
పాల్గొన్న సభ్యులు:	51,365

మహబూబాబాద్ సఖి సెంటర్ ద్వారా ఏడాదిలో అందించిన సేవల వివరాలు

సఖి కేంద్రంలో నమోదైన కేసుల సంఖ్య :	284
పరిష్కరించిన కేసులు :	197
పెండింగ్ కేసులు :	87
సఖి కేంద్రంలో అందించిన సేవలు :	
సైకో సోషల్ కౌన్సిలింగ్ :	630
లీగల్ కౌన్సెలింగ్ :	425
డీఐఆర్ ఫైలింగ్:	11
అవగాహన కార్యక్రమాలు :	93
పాల్గొన్న సభ్యుల సంఖ్య :	19,659

181 మహిళా హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన 82 కాల్స్‌కు 25 కేసులు నమోదు చేశారు.
284 కేసుల్లో 123 మందికి (పిల్లలతో) షెల్టర్ ఇచ్చారు.

మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
MEDHA
మేధా
సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
కొత్త బస్టాండ్ ప్రక్కన, బాలసముద్రం రోడ్, హనుమకొండ
అన్నిరకాల కంటి చికిత్సలు చేయబడును
ఆరోగ్యశ్రీ, EHS మరియు ఇన్సూరెన్స్ సేవలు అందుబాటులో కలవు
డా॥ అంధ్రు పావని రెడ్డి
MD (Ophthalmology)
Fellowship vitreo retinal surgery (FAEI)
Consultant Retinal Surgeon
నరముల స్కానింగ్ కలదు
Cell: 9966909020, 9966909030

SAKSHI
కావలెను
ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో సర్వీస్ రిప్రజెంటేటివ్స్ (SR) గా మరియు అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్ (ACO) గా పని చేయుటకు ఆసక్తిగల యువకులు కావలెను.
అర్హత : ఇంటర్ పాస్ (మార్కెటింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత)
వయస్సు : 19 నుండి 30 సం॥లోపు
అనుభవం: ఇతర దినపత్రికలలో సేల్స్ విభాగంలో పనిచేసినవారు, వివిధ కంపెనీలలో మార్కెటింగ్ రంగాలలో పనిచేసిన వారు, కొత్తవారు కూడా దరఖాస్తు చేయవచ్చును.
ఆసక్తిగలవారు తేది: 10-03-2025 సోమవారం రోజున ఉ॥ 11 గం॥ల నుండి 2 గం॥ల లోపు బయోడేటా, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, జిరాక్స్ సర్టిఫికెట్లతో సంప్రదించండి.
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశము :
సాక్షి సిటీ కార్యాలయం, ఇ.నెం. 2-5-389,
శ్రీ వేంకటేశ్వర కాలనీ, కోర్టు వెనకాల, నక్కలగుట్ట, హనుమకొండ.
మేనేజర్ (సర్క్యులేషన్): 9912440459, 7036166622

మహిళా దినోత్సవానికి 12 ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించే మహిళా దినోత్సవ కార్యక్రమానికి మహిళలను తరలించేందుకు వరంగల్ రీజియన్‌లో 12 బస్సులు కేటాయించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాలకు రెండేసి బస్సుల్లో మహిళలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అద్దె బస్సులను మహిళలకు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో ఎన్ని బస్సులు కేటాయిస్తారనే దానిపై స్పష్టత కరువైంది. దీనిపై ఆర్టీసీ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు తమకు స్పష్టమైన ఆదేశాలు అందలేదని తెలిపారు. వరంగల్ రీజియన్‌కు మహిళా సంఘాలకు 40 నుంచి 50 బస్సులు ఇస్తామని చెప్పినట్లు సమాచారం. మహిళా దినోత్సవం రోజున జిల్లాకు 2 మెగావాట్ల చొప్పున సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అయితే మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపుపై ఎలాంటి స్పష్టత లేదు. రాష్ట్రవ్యాప్తంగా 150 బస్సులు మహిళా సంఘాలకు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో వరంగల్ రీజియన్‌కు ఎన్ని ఇస్తారనేది నేడు(శనివారం) స్పష్టం కానుంది.

వాజ్‌పేయి జ్ఞాపకాలతో డాక్యుమెంటరీ

హన్మకొండ: మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి జీవిత చరిత్ర, ఆయనతో పలువురు వ్యక్తులకు సన్నిహిత సంబంధాల జ్ఞాపకాలతో డాక్యుమెంటరీ రూపొందించనున్నట్లు అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ అజ్మీరా సీతారాంనాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అటల్ జీ యాది (స్మృతి)లో నేను' అనే ఈ కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకుందన్నారు. వాజ్‌పేయితో సన్నిహితంగా ఉన్న వారు ఉమ్మడి వరంగల్‌లో ఎందరో ఉన్నారని, వారంత తమ వద్ద ఉన్న జ్ఞాపకాలను తన వాట్సాప్ నంబర్లు 9849235055, 9550735675కు గాని ఎఎస్ఆర్‌నాయక్59 ఎట్‌ది రేట్ జీమెయిల్ డాట్ కామ్‌కు పంపాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రావు, ధర్మారావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ బస్టాండ్ సమీపం సెంట్రల్ కాంప్లెక్స్‌లోని శ్రీహర్ష కన్వెన్షన్‌హాల్‌లో పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి నగదు పురస్కారంతోపాటు ప్రశంసపత్రాలు, పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు నమోదు , ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మహిళల 'సౌర' సాగు..

ప్రయోగాత్మకంగా హనుమకొండ జిల్లాకు 2 మెగావాట్ల ఉత్పత్తి

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మెగావాట్ల ఉత్పత్తి
- ఆరు జిల్లాల్లో 11 గ్రామాల ఎంపిక
- ప్రభుత్వ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు
- నేడు (మహిళా దినోత్సవం రోజు) సీఎం రేవంత్ రెడ్డితో శంకుస్థాపన

హన్మకొండ : మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ దిశగా వివిధ కార్యక్రమాల్లో మహిళలను భాగస్వాములను చేస్తోంది. ఈ క్రమంలో మహిళలతో సౌర విద్యుత్ ఉత్పత్తి చేయించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాల్లో ప్రభుత్వ భూములు గుర్తించింది. ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాకు 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 గ్రామాలను ఎంపిక చేసింది. ప్రభుత్వ స్థల లభ్యతను బట్టి హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండు గ్రామాల చొప్పున మహబూబాబాద్ జిల్లాలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. మహబూబాబాద్ జిల్లాలో ఒకే ప్రాంతంలో 8 ఎకరాల స్థలం అందుబాటులో ఉండడంతో ఒకే గ్రామాన్ని ఎంపిక చేసింది. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి నాలుగు ఎకరాల స్థలం అవసరం. ప్రతీ గ్రామంలో ఆర్థికంగా పటిష్టంగా ఉన్న ఎంపిక చేసిన రెండు గ్రామైఖ్య సంఘాలకు 0.5 మెగావాట్ల చొప్పున సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. రెండు గ్రామైఖ్య సంఘాలకు ఒక మెగావాట్ చొప్పున ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది.

నేడు ముఖ్యమంత్రితో ప్రారంభం..

ప్రభుత్వం మహిళా సంఘాలతో ముందుగా జిల్లాకు రెండు గ్రామాల్లో 2 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామాలను ఎంపిక చేశా రు. జనగామ జిల్లాలో అశ్వరావుపల్లి, వావిలాల, హనుమకొండ జిల్లాలో సూరారం, ఆత్మకూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భజనపల్లి, మహాముత్తారం, ములుగు జిల్లాలో పత్తిపల్లి, జగ్గన్నపేట, వరంగల్ జిల్లాలో వంచనగిరి, మురిపిరాల, మహబూబాబాద్ జిల్లాలో అబ్బాయిపాలెం గ్రామాలను ఎంపిక చేశారు. శనివారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి మహిళలతో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సౌర విద్యుత్ ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక చర్యలు..

సౌర విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకొచ్చింది. ప్రధానంగా రైతులను సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకం తీసుకొచ్చింది. రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. రైతులతో పాటు మహిళా స్వయం, రైతు ఉత్పత్తి, సహకార, నీటి వినియోగదారుల సంఘాలు, పంచాయతీలు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పథకం రూపొందించాయి. ప్రభుత్వ, దేవాలయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి.

యుద్ధప్రాతిపదికన ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ..

రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యం విధించుకోగా ఇందులో వెయ్యి మెగావాట్లు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపట్టి సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయా లేదో అని అధికారులు పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 95 స్థలాల్లో 964 ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తించారు. ఇందులో 53 స్థలాలు సోలార్ ప్లాంట్ ఏర్పాటునకు అనువుగా ఉన్నట్లు తేల్చారు. హనుమకొండ జిల్లాలో 38 స్థలాల్లో 15 స్థలాలు అనువుగా ఉన్నట్లు గుర్తించారు. వరంగల్ జిల్లాలో 13 స్థలాల్లో 6, ములుగు జిల్లాలో 12 స్థలాల్లో 11, మహబూబాబాద్ జిల్లాలో 4 స్థలాల్లో 4, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో 13 స్థలాల్లో 8, జనగామ జిల్లాలో 15 స్థలాల్లో 9 స్థలాలు అనువుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఒక్క మెగావాట్ ప్లాంట్‌కు రూ.3 కోట్ల వ్యయం..

ఒక్క మెగావాట్ ప్లాంట్‌కు రూ.3 కోట్ల వ్యయం కానుంది. ఇందులో స్వయం సహాయక సంఘాలు 10 శాతం కింద రూ.30 లక్షలు భరిస్తే, బ్యాంకు 90 శాతం రుణం కింద రూ.2.70 కోట్లు అందిస్తుంది. ప్లాంట్ ద్వారా ఏడాదికి 1.66 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రోజుకు దాదాపు 4,500 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. యూనిట్‌కు డిస్కంలు రూ.3.13 చొప్పున చెల్లిస్తాయి. నెలకు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను బట్టి ప్రతీ నెల డిస్కం చెల్లింపులు చేస్తుంది. సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందొచ్చు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ BA/B.Com/B.Sc/ BBA / BBM/ Diploma / MA / M.Com/ M.Sc/ MBA / MCA/ B.Tech / D.Pharmacy/ B. Pharmacy/ LLB/ BAMS / BHMS పూర్తి చేయండి ✆ 99895 30727 [B-755673]

REAL ESTATE
HOUSE FOR SALE
■ House for sale 164 sq.yards West Face Near Relief Hospital Arepally, Warangal. 68 Lakhs. Loan Available. Cell: 9652715142 [W-1265058]

WANTED
■ వరంగల్‌లో ఇంట్లో ఉండి పనిచేయుటకు భార్య భర్తలు కావలెను. జీతం ఇద్దరికి కలిపి 18000/- + ఉచిత రూమ్, ఉచిత కరెంట్ సంప్రదించండి. +91 9849910111. [WA-17523]
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు వార్డ్ బాయ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15160]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


కూతుళ్లే మహారాణులు

- కొందరు ఒక్కరితోనే సరి..
- మరికొందరికి ఇద్దరు కూతుళ్లు
- వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న పేరెంట్స్
- మగపిల్లలు లేని లోటు తీరుస్తున్నారంటున్న తల్లిదండ్రులు



కుమార్తెలతో కృష్ణమూర్తి, శోభ దంపతులు

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన ఈగ కృష్ణమూర్తి–శోభ దంపతులకు రమ్యకృష్ణ, సౌమ్యకృష్ణ ఇద్దరు కుమార్తెలు. కృష్ణమూర్తి ఇంటి ముందు చిన్న టీ కొట్టుతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తెల ప్రాథమిక విద్య స్టేషన్ ఘన్‌పూర్‌లో, ఇంటర్ హనుమకొండలోని ప్రైవేట్ కళాశాలలో చదివించాడు. పెద్దకూతురు రమ్యకృష్ణ హైదరాబాద్ వీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తోంది. చిన్నకూతురు సౌమ్యకృష్ణ కూడా హైదరాబాద్ ఎంజీఐటీ కళాశాలలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్ పూర్తి చేసింది. ఈమె నాలుగు నెలల క్రితం నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. చిన్న తనం నుంచి తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను చూసిన అక్కాచెల్లెల్లు పట్టుదలతో చదివి కన్నవారి కష్టాలు దూరం చేశారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులయ్యారని, ఆడపిల్లలైనా మగ పిల్లలు లేని లోటు తీర్చారంటూ ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

కూతురంటేనే ఇష్టం


కరాటేలో శిక్షణ పొందుతున్న అంజనారావు

ఖానాపురం: తమకు కూతురంటేనే ఇష్టం అంటున్నారు ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పేరాల హరీశ్‌రావు–కల్పన దంపతులు. పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న వీరికి కుమార్తె అంజనారావు పుట్టగానే ఆమెపై ఇష్టంతో ఇక పిల్లలు వద్దనుకున్నారు. ఆమెను ఐపీఎస్ చేయడమే లక్ష్యంగా పెట్టుకుని చదివిస్తున్నారు, ఐదేళ్ల ప్రాయం నుంచే కరాటేలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఎన్ని ఆటంకాలెదురైనా కుమార్తెను ఐపీఎస్‌గా చూడాలన్నదే తమ కోరిక అని వారు చెబుతున్నారు.


తల్లిదండ్రులతో అంజనారావు

ఝాన్సీరాణులుగా తీర్చిదిద్దుతాం..


కూతుళ్లతో తల్లిదండ్రులు తిరుపతి,సరిత

టేకుమట్ల: కూతుళ్లయితే ఏంటి వారిని ఝాన్సీరాణి మాదిరి తీర్చిదిద్దడమే మా బాధ్యత అంటున్నారు టేకుమట్ల మండలంలోని పెద్దంపల్లికి చెందిన శాస్త్రాల తిరుపతి–సరిత దంపతులు. వారి ఇద్దరు కుమార్తెలు వర్ధినిసేన తొమ్మిదో తరగతి చదువుతుండగా.. ధైర్యసేన రెండో తరగతి చదువుతోంది. వర్ధినిసేనకు కరాటే, కర్రసాము, క్లాసికల్ డ్యాన్స్, సింగింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇటీవల గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ అండర్–14 కరాటే విభాగంలో తెలంగాణ నుంచి వర్ధినిసేన పాల్గొంది. చిన్న కూతురు ధైర్యసేనకు సైతం పలు రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు.

మేం ఇద్దరం.. మాకు ఒక్కరు!


పాప సమీరాతో షేక్ మహబూబ్‌పాషా, షేక్ రిజ్వానా దంపతులు

మహబూబాబాద్ అర్బన్: మేం ఇద్దరం. మాకు ఒక్క ఆడపిల్ల చాలు.. అంటున్నారు మానుకోట జిల్లా కేంద్రంలోని పాత బజార్‌కు చెందిన షేక్ మహబూబ్‌పాషా–షేక్ రిజ్వానా దంపతులు. 2014లో వారికి సమీర జన్మించింది. ఆ చిన్నారిని ధైర్యవంతురాలిగా పెంచాలని నిర్ణయించుకున్నారు. కరాటే, కబడ్డీ, రన్నింగ్, స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. ఆ పాపలోనే తన తల్లిని చూసుకుంటున్నట్లు రిజ్వానా చెబుతున్నారు. మాకు అబ్బాయి పుట్టలేదని బాధపడకుండా పాపను మగపిల్లలతో సమానంగా పెంచుతామంటున్నారు షేక్ మహబూబ్‌పాషా–షేక్ రిజ్వానా దంపతులు.